క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కడియం: మండల కేంద్రమైన కడియం నుంచి బుర్రిలంక మీదుగా జాతీయ రహదారికి వెళ్లేందుకు ఉపయోగపడే సీసీ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.2.65 కోట్ల మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ పనులను మంత్రి వేణు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

నర్సరీ రైతుల వినతి

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, పాలక వర్గ సభ్యులు గురువారం కడియం విచ్చేసిన మంత్రి చెల్లుబోయిన వేణును కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. నర్సరీ ప్రాంతంలో రోడ్లను అభివృద్ధి చేయాలని, విద్యుత్‌ను 9 గంటలూ ఇవ్వాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడతానని మంత్రి వేణు హామీ ఇచ్చారు.

సీఎంఏ ఫైనల్‌లో శ్రీహర్షిణికి 11వ ర్యాంక్


శ్రీహర్షిణి

ప్రకాశం నగర్: ద ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి సీఎంఏ ఫైనల్ పరీక్షల్లో నగరానికి చెందిన కొత్తగుండు శ్రీహర్షిణి జాతీయ స్థాయిలో 11వ ర్యాంక్ సాధించింది. ఈ విషయాన్ని చాప్టర్ మేనేజ్‌మెంట్ టీం సభ్యులు పి.నారాయణరావు, శ్రీధర్, బొజ్జ సత్యనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. హర్షిణి జాతీయ స్థాయిలో ఇంటర్ పరీక్షల్లో 37వ ర్యాంక్ సాధించి నగరానికి గుర్తింపు తీసుకువచ్చిందన్నారు. సీఎంఏ ఫైనల్‌లో ఎం.జగదీష్ 47, పి.సురేష్ 50, అలాగే ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సాయి మేఘన 48వ ర్యాంక్ సాధించారని తెలిపారు.

హనుమంత వాహనంపై వెంకన్న స్వామి


హనుమంత వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు

కడియం: దుళ్లలోని శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అశేష భక్త జనవాహిని వెంట రాగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక పూజల్లో భాగంగా ఉదయం అన్నకూటోత్సవం జరిగింది. పులిహోర ప్రసాదంతో స్వామివారి చిత్రాన్ని రూపొందించారు. అనంతరం భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అలాగే శుక్రవారం లక్ష్మీహోమం, హంస వాహన సేవ ఉంటాయని ఆలయ భక్త బృందం తెలిపింది.

సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళల అరెస్టు

కడియం: సారా అమ్ముతున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసి, వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. దుళ్ల గ్రామానికి చెందిన తీగిరెడ్డి రమణను అరెస్టు చేసి, ఆమె నుంచి పది లీటర్లు, జేగురుపాడు పాములమెట్ట కాలనీకి చెందిన కారంకి లావణ్యను అరెస్టు చేసి, మరో పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నరు. నిందితులను కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ దాడిలో ఎస్సైలు కృష్ణసాయి, నాగదుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం


నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లలో జీఆర్పీ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: తెలంగాణ నుంచి రైలులో అక్రమంగా తరలిస్తున్న పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, రాజమహేంద్రవరానికి చెందిన జమ్ము పాపినాయుడిను అరెస్ట్ చేశామని జీఆర్పీ ఎస్సై మావుళ్లు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో 2వ నంబర్ ప్లాట్‌ఫాం వద్ద గురువారం వీటిని పట్టుకున్నామన్నారు. మద్యం బాటిళ్ల విలువ రూ.2050 ఉంటుందని తెలిపారు.

పల్లెల ముంగిటకే ప్రభుత్వ సేవలు


జక్కంపూడి రామ్మోహనరావు, వంగవీటి రంగా విగ్రహాలను ఆవిష్కరించి మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంలో పార్టీ నాయకులు


జేగురుపాడులో భవనాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వేణు. చిత్రంలో జక్కంపూడి విజయలక్ష్మి, చందన నాగేశ్వర్ తదితరులు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- జేగురుపాడులో ప్రభుత్వ భవనాల ప్రారంభం
- జక్కంపూడి రామ్మోహనరావు, వంగవీటి రంగా విగ్రహాల ఆవిష్కరణ

కడియం: ప్రభుత్వ సేవలను నేరుగా గ్రామాల్లోనే అందించేందుకు పాలనా సంస్కరణలు తీసుకువచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని జేగురుపాడు పంచాయతీ పరిధిలో రూ.1.40 కోట్లతో నిర్మించిన సచివాలయం, వెల్నెస్ సెంటర్, కన్వెన్షన్ హాలు భవనాలను, దివంగత నేతలు జక్కంపూడి రామ్మోహనరావు, వంగవీటి మోహన రంగా విగ్రహాలను వైఎస్సార్ సీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తదితరులతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు.

ఆదర్శవంతంగా జేగురుపాడు

మంత్రి వేణు మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను ఇంటి ముంగిటకే తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. జేగురుపాడు గ్రామాన్ని సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. స్టాలిన్ రాజకీయాల్లో ప్రవేశించేందుకు ప్రోత్సహించిన దివంగత జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాన్ని, అదే విధంగా వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు. సతీష్ చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, పార్టీ నాయకులు నక్కా రాజబాబు, అనసూరి పద్మలత, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, ఎంపీటీసీలు ఆకుల సుధాకర్, కట్టుంగ నాగరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- పురస్కారాల ప్రదానం


కడియంలో వలంటీర్లను సత్కరిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు, చిత్రంలో ప్రజాప్రతినిధులు, నాయకులు

కడియం: ప్రతి సంక్షేమ పథకాన్ని నేరుగా లబ్ధిదారుడికి అందిస్తూ వలంటీర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి అందజేశారు.

పారదర్శకంగా పాలన

మంత్రి వేణు మాట్లాడుతూ అవినీతి, వివక్షకు తావు లేకుండా పారదర్శకంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను గుర్తించి, వారికి ప్రోత్సాహకంగా అవార్డులను, నగదును ప్రభుత్వం అందిస్తోందన్నారు. వరుసగా నాలుగో ఏడాది వలంటీర్లకు వందనం పేరుతో ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం చేశామన్నారు. సేవా వజ్ర కింద సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.30 వేలు, సేవా రత్న కింద సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ. 20 వేలు, సేవా మిత్ర కింద సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్ తో పాటు రూ.15 వేలు అందిస్తున్నామన్నారు. కడియం మండలంలో 482 మంది వలంటీర్లకు ప్రోత్సాహాన్ని అందించడం జరిగిందన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

మంత్రి వేణు మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల కింద కడియం మండలంలోని 2,30,455 మంది లబ్ధిదారులకు రూ.196.22 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. వలంటర్ వ్యవస్థను రూపొందించడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తిని అమలు చేస్తున్నారన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.

సేవా సారథులు వీరే..

సేవా వజ్రగా ఎంపికైన వాసంశెట్టి అశ్వని (కడియపుసావరం – 2), తిక్కాతి కనకరత్నం (పొట్టిలంక – 1), సేవారత్నగా ఎంపికైన బళ్ల లక్ష్మి (జేగురుపాడు – 2) , జగత కుమారి (కడియం – 3), రాయుడు గోవిందు (కడియపుసావరం – 2), చాగంటి కిశోర్‌బాబు (వేమగిరి – 1), పెందుర్తి పద్మిని (వేమగిరి – 4), మిగిలిన వారికి సేవామిత్ర అవార్డులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ ఈలి గోపాలం, జేసీఎస్ కన్వీనర్ తడాల చక్రవర్తి, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్లు వెలుగుబంటి అచ్యుతరామ్, తిరుమలశెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, టేకి శ్రీనివాసరావు, సంగిత వెంకటేశ్వరరావు, బోడపాటి సత్యనారాయణ, సాపిరెడ్డి కామేష్, పితాని శ్రీను, చిలుకూరి రామకృష్ణ, సర్కార్ బాషా, ఎంపీడీవో జి.రాజ్ మనోజ్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

స్వీయ నియంత్రణతో అలవాట్లు దూరం


మాట్లాడుతున్న సైకాలజీ నిపుణులు డాక్టర్ ఎస్తేర్

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణతో వ్యసనాలను విడనాడాలని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్.ఎస్తేర్ అన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ నేతృత్వంలో గురువారం మత్తు పదార్థాల వ్యసన బాధితులైన ఖైదీలకు సామాజిక పరివర్తనా కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. జైలు డిప్యూటీ సూపరెంటెండెంట్ ఎం.రాజ్ కుమార్ అధ్యక్షతన, డాక్టర్ ఎస్తేర్ ఖైదీలకు మానసిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరికీ శక్తి సామర్థ్యాలు ఉంటాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుంటే జీవితంలో ఉన్నతి స్థితికి చేరవచ్చని తెలిపారు. జీవితాలను విజయాల వైపు మళ్లించిన పలువురి గాథలను వివరించారు. జైలు డిప్యూటీ సూపరెంటెండెంట్ ఎం.రాజ్ కుమార్ మాట్లాడుతూ జైలు శిక్ష అనంతరం నిష్ణాతులతో సోషల్ ఇంక్యుబేషన్ కార్యక్రమాల ద్వారా నిరంతరం మానసిక, మనోధైర్య శిక్షణా కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయన్నారు. వైద్యాధికారి డాక్టర్ పి.కోమల మాట్లాడుతూ ఖైదీలు వ్యసనాల నుంచి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జైలు వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాసరావు, జైలు ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రాజెక్టు అధికారులు, ఉపాధ్యాయులు

ధవళేశ్వరం: చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ధవళేశ్వరం వాడపేట ఎంపీపీ పాఠశాలలో తడి, పొడి చెత్తపై ప్రభాత్ వ్యర్థ పదార్థాల ప్రాజెక్టు అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ భువన్ కుమార్, కో ఆర్డినేటర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.వరలక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ బాలాజీపేట సబ్ స్టేషన్ పరిధిలోని నేతాజీ నగర్, జేఎల్‌బీ నగర్, బృందావన కాలనీల్లో సరఫరా ఉండదన్నారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ లాలాచెరువు ఏరియా, సుబ్బారావుపేట, నారాయణపురం, బాబానగర్, సైకిల్ కాలనీ, గాం.దీపురం 4, వాంబే కాలనీ, స్వరూప నగర్, రూపా నగర్, గోపాల్ నగర్ పుంత రోడ్డు, నాగమ్మ తల్లి గుడి రోడ్డు , పోలీస్ క్వార్టర్ల వెనుక ప్రాంతం, ప్రకాశం నగర్ ఏరియా అంతరాయం కలుగుతుందన్నారు.
- ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ మోరంపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆల్ బ్యాంక్ కాలనీ, శ్రీనగర్, అమ్మ హాస్పిటల్ స్ట్రీట్, మోడల్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేశభక్తిని పెంచే 'ఆపరేషన్ వాలెంటైన్'


విలేకరులతో మాట్లాడుతున్న హీరో వరుణ్ తేజ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రం దేశభక్తిని పెంపొందించేలా ఉంటుందని ఆ చిత్ర కథానాయకుడు వరుణ్ తేజ్ తెలిపారు. భారత జవాన్‌లపై పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన దాడి, ఆ తర్వాత పాకిస్తాన్ ఉగ్రవాదులపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తీర్చుకున్న ప్రతీకారం వంటి అంశాలతో ఈ సినిమాను తీర్చిదిద్దారన్నారు. తెలుగు, హిందీ భాషల్లో మార్చి ఒకటిన విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా వరుణ్ తేజ్ రాజమహేంద్రవరం వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక షెల్టాన్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిత్రంలోని పలు సన్నివేశాలను వివరించారు.

చిరంజీవి కృషికి నిదర్శనమే పద్మవిభూషణ్

మెగాస్టార్ చిరంజీవి కృషి, పట్టుదలకు నిదర్శనమే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మవిభూషణ్ పురస్కారం అని హీరో వరుణ్‌తేజ్ అన్నారు. స్థానిక ఆనం కళాకేంద్రంలో రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పద్మ విభూషణ్ మెగా సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వరుణ్ తేజ్ మాట్లాడుతూ చిరంజీవి కష్టార్జితం, మెగా అభిమానుల ఆదరాభిమానాలతోనే తాను, చరణ్ అన్న, అందరం సినిమా ఇండస్ట్రీలో రాణిస్తున్నామన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

స్కౌట్ శిక్షణతో విద్యార్థుల్లో సేవాగుణం

- ఎంపీ భరత్‌రామ్
- పూర్తిస్థాయిలో రైల్వేస్టేషన్ అభివృద్ధి


నిర్వాహకులను అభినందిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థులలో క్రమశిక్షణ, ధైర్య సాహసాలు, సేవా గుణాన్ని పెంపొందించేందుకు స్కౌట్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గురువారం స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్ పావెల్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పోటీలలో విజేతలైన స్కౌట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసి, అభినందించారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సమాజంలో పోలీసులు ప్రజలకు ఏ విధంగా సేవలందిస్తారో, అదే విధంగా విద్యార్థి దశ నుంచీ ఉత్సవాలు, జాతరలు, ఇతర కార్యక్రమాల్లో సేవలు అందించేందుకు స్కౌట్ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.260 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తాను ఎంపీగా రైల్వే స్టేషన్లో 4, 5 ప్లాట్‌ఫాంలు తీసుకొచ్చానన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో రూ.355 కోట్లతో ఏ విధంగా అభివృద్ధి జరగనుందో, అదే మాదిరిగా రైల్వే స్టేషన్ కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రైల్వే ప్రధాన స్టేషన్ ముఖద్వారం ఐదుబళ్ల మార్కెట్ వద్దకు మారబోతోందన్నారు. ఈ నెలలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారని ఎంపీ భరత్ తెలిపారు.

రచ్చబండలో పలువురి వినతులు

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో గురువారం రాజన్న రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పలు నియోజక వర్గాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను వివరించారు. స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి, వాటిని పరిష్కరించాలని కోరారు.

పేదల సొంతింటి కల సాకారం


రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: పేదల సొంతింటి కలను సీఎం జగన్ నెరవేర్చారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. పిడింగొయ్యి సచివాలయం -4లో జరుగుతున్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. సచివాలయ సెక్రటరీ డి.రవితేజ ఈ విధానాన్ని ఆయనకు వివరించారు. ఆకుల వీర్రాజు మాట్లాడుతూ గ్రామ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు కోరుకొండ మండలం మధురపూడి లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి అందిస్తున్నట్టు తెలిపారు. జగనన్న కాలనీల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. వీఆర్వో లంకా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

4 వేల పెన్నులతో వాగ్దేవికి ప్రత్యేక పూజలు


పసుపు, కుంకుమతో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజ

సీటీఆర్ఐ: వాగ్దేవికి 4 వేల పెన్నులతో ప్రత్యేక పూజలు నిర్వహించామని, వాటిని పది, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేస్తామని శ్రీ మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామీజీ అన్నారు. గాడాలలోని పీఠంలో గురువారం ప్రత్యేక పూజల నిర్వహించారు. 560 కేజీల పసుపు, కుంకుమలతో మహాలక్ష్మి, దుర్గమ్మకు సామూహిక మహా అర్చన నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ మహాలక్ష్మీ దేవిని స్మరించడం వల్ల అష్టైశ్వరాలు, దుర్గమ్మను పూజిస్తే శత్రు భయం నశించి, సర్వ ఫలాలు కలుగుతాయన్నారు. అమ్మవారికి పూజ చేసిన పసుపు, కుంకుమను గడపగడపకూ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మనగుడి – మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి జాతీయ చైర్మన్ ధరణికోట వెంకట హేమవతి, జాతీయ గౌరవాధ్యక్షుడు అంబటి గురుమూర్తి, జాతీయ కార్యదర్శి మద్ది శ్రీనివాసరెడ్డి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, వీర అప్పారావు, అంబటి శ్రీనివాసరావు, సర్దార్ సుమేధ, గుబ్బల గంగాభవాని, ముదునూరు వెంకటలక్ష్మి, గ్రంధి విజయలక్ష్మి, రేణుక రామలక్ష్మి, పూర్ణిమ, నరసింహ పాల్గొన్నారు.

పరీక్షలను సమర్థంగా నిర్వహించాలి


విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

ధవళేశ్వరం: పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలను, ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకూ జరిగే ఫార్మేటివ్-4 పరీక్షలను అత్యంత సమర్థంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. 6వ తరగతిలో విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఫార్మెటిక్-4 పరీక్షలకు సిలబస్ పూర్తి అయ్యిందా, ఉపాధ్యాయులు విద్యార్థుల నోట్ బుక్స్‌ను దిద్ది, రిమార్కులు రాశారో లేదో పరిశీలించారు. విద్యార్థులను సిలబస్‌పై కొన్ని ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు కూడా ఉపాధ్యాయుల అకాడమిక్ అంశాలను తరచూ పరిశీలించి సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	ఊరుపేరు భైరవకోన
సూర్యమినీ	ముఖ్యగమనిక, క్రాక్
సూర్యప్యాలెస్	భ్రమయుగం
స్వామి	ఈగల్
శివజ్యోతి	అంబాజీపేట మ్యారేజీబ్యాండు
అనుశ్రీ	హనుమాన్
రాజా	ఊరుపేరు భైరవకోన
ఊర్వశి	సిద్ధార్థ్ రాయ్
రంభ	యాత్ర2, రాజధాని ఫైల్స్
మేనక	మస్త్‌షేడ్స్ ఉన్నాయిరా, లాల్ సలామ్
అప్సర	గుంటూరుకారం
కుమారి	సుందరం మాస్టర్
నామవరం	
వీఎస్ మహల్	ఊరుపేరు భైరవకోన
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	భ్రమయుగం
కడియం	
వెంకటసూర్య	సిద్ధార్థ్ రాయ్

నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్ సీజ్


వీరభద్రపురంలో వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు గురువారం నగరంలోని వీరభద్రపురంలో గల ది సన్ రైజ్ వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం యూనిట్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఉన్న వాటర్ ప్లాంట్ల నిర్వాహకులందరూ సంబంధిత అధికారుల నుంచి అన్ని అనుమతులు పొందిన తర్వాతే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాల మేరకు తాగునీటి శుద్ధి, ప్యాకింగ్ చేయాలన్నారు. లేకపోతే ప్లాంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ది సన్ రైజ్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు పడాల హరనాథ్‌రెడ్డి నిబంధనలు పాటించకపోవడంతో సీజ్ చేశామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు సదరు వాటర్ ప్లాంట్ నుంచి ఒక లీటరు చొప్పున 16 బాటిళ్ల శాంపిల్‌ను తీశారని, వాటిని పరీక్షల కోసం నాచారంలోని స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి పంపుతామన్నారు. తనిఖీలలో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ నాగ వెంకటరాజు, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలు కావాలి

మధురపూడి: డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. బూరుగుపూడిలో గురువారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు.

24న డ్రైవర్ అభ్యర్థులు హాజరుకావాలి

రాజమహేంద్రవరం రూరల్: దిశ ఔట్‌సోర్సింగ్ డ్రైవింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న 118 మంది అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్ఐ సంజీవ్‌కుమార్ వద్ద హాజరుకావాలని కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. ఇతర వివరాలకు 96766 11053, 77028 98074 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులకు రేపు శంకుస్థాపన, ప్రారంభోత్సవం

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో రూ.8 కోట్లతో నిర్మించే కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన శంకుస్థాపన, సీతానగరంలోని ప్రభుత్వ హైస్కూల్లో రూ 2.45 కోట్లతో నిర్మించిన క్రీడా వికాస కేంద్ర (ఇండోర్ స్టేడియం) ప్రారంభోత్సవం శనివారం ఘనంగా జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాతో కలిసి వీటిని ఆయన ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ఆరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు.